# అచలపతీ - యయాతి మామయ్యా

నిద్ర మధ్యలో మెలుకువ వచ్చి చూస్తే ఉదయం ఏడవుతోంది. పక్కింట్లో భార్యాభర్తలు పోట్లాడుకుంటున్నారు కాబోలు రేడియో గట్టిగా పెట్టారు. అదేమిటో గానీ పక్కింటి రేడియోపాట మనల్ని అలరిస్తుంది. పక్కింటి మసాలా వాసన నోరూరిస్తుంది. 'పక్కింటి భార్య చొంగ కార్పిస్తుంది కూడా' అంటాడు మోజెస్. అలా అన్నప్పుడు ఆయన తన గురించే చెప్పుకుంటున్నాడని మనం అనుకొని పోతామని దేవుడి చేత బ్లాక్ అండ్ వైట్‌లో.. కాదు స్టోన్ అండ్ లైట్‌లో రాయించి తెచ్చాడు.

అవెప్పుడో వేలాది సంవత్సరాల క్రితం కబుర్లు. సొంత భార్యనే సాంతం తిలకించే తీరికలేని ఈతరం మగాడికి ఇవి వర్తిస్తాయా? అటూ ఇటూ ఫ్లాట్స్ లేచిపోయి 'నైబర్స్ వైవ్స్' సంఖ్య పుంఖానుపుంఖాలయినపుడు వాళ్లలో ఎంతమందిని పట్టించుకోగలడు? విగరస్‌గా 'వూ' చేసి 'ఊ' అనిపించగలడా? టెన్‌కమాండ్‌మెంట్స్‌కి అమెండ్‌మెంట్ చేయాలని పోప్‌గారికో ఉత్తరం రాయాలని అనుకొంటుండగానే రేడియోలో సుభాషితాల కార్యక్రమం ప్రారంభమయింది. ఏదో భర్తృహరి శ్లోకం – దాని అర్థం –పూలతీగ అందుబాటులో ఉన్న ముళ్లకంపనైనా ఆశ్రయిస్తుందట. పూబోడి కూడా వెంటబడే వాడు ఎలాటి వాడైనా సరే వాడి ఆకర్షణలో పడుతుందట.

ఎగైన్ – ఈ భర్తృహరి – ఏ శతాబ్దంవాడో – చెప్పినది మనం ఇప్పటికీ మననం చేసుకోవాలా? మహిళాలోకం 'గుండమ్మకథ' తోనే నిద్ర లేచింది. ఆ తర్వాత, ముందు కూడా నమ్మి చెడిన నారీమణుల గురించి చాలా కథలు వచ్చాయి. కొనబోయే

సరుకుల నాణ్యతకై తాపత్రయ పడుతున్నదీ, నిర్ణయిస్తున్నదీ కూడా ఆడవాళ్లేనని అడ్వర్టయిజర్లు ఘోషిస్తున్నారు. మరి వెంటబడే వాడి మంచిచెడులు చూడలేని కబోదా ఆధునిక మహిళ? నాటెటాల్! భర్తృహరిని కూడా చిత్రిక పట్టి కాలానుగుణంగా తిరగరాయవలసిన అవసరం ఉందన్నమాట!

నేను ప్రస్తుతం ప్రవచిస్తున్న సుభాషితాలను ఇంకో వంద సంవత్సరాల తర్వాత 'అప్టుడేట్' చేయడానికి ఎవరి చేతనైనా అవుతుందా? లేక నేనే 'సంభవామి సెంచరీ, సెంచరీ' అన్నట్టు లైటుతో సహా దిగి రావాలా? అని ఆలోచిస్తుండగానే నిద్ర పట్టేసింది.

మామూలుగా పదకొండు గంటలకు లేచాను. సాధారణంగా తెల్లవారుఝామున విన్న పాటలూ, మాటలూ ఓపి నయ్యర్ గుఱ్ఱపు డెక్కల్లా ఒక పట్టాన వదలకుండా వెంట నడుచుకుంటూ వస్తాయి. కానీ లేవగానే అచలపతి వచ్చి 'యతి మామయ్య వస్తున్నా'డని చెప్పడంతో ఆలోచనల గాలికోడి అటుతిరిగింది. ఆయన యాభైయేళ్ల ఈస్ట్ 'మేన్లీ' కలర్ ఫ్లాష్‌బ్యాక్ సినిమా రీలు ఊహల్లో పదినిమిషాలు తిరిగేసరికి ఇహ చాలనిపించి, ఇహలోకంలోకి వచ్చిపడి 'అది నాయనా కథ' అన్నట్టు "మామయ్య పేరు నాకు నచ్చలేదోయ్ అచలపతీ" అన్నాను.

'నిజమా సర్! సాధారణంగా తెలుగు వాళ్లు చేంతాడంత పేరు పెట్టుకుంటారని, దాన్ని తుంపులుచేసి ప్రతిదాన్ని ఇంగ్లీషు ఇనీషియల్‌గా మార్చి మోసుకు తిరుగుతుంటారని మీరు నిరసించడం నా వద్ద నమోదయింది సర్. అందువల్ల ఆ ధోరణికి భిన్నంగా రెండక్షరాల 'యతి' పేరు ముచ్చటగా ఉందని మీరన్నట్లు నన్నింకా సేవిస్తున్న జ్ఞాపకశక్తి తెలుపుతోంది. మీ ఆలోచనా ధోరణిలో మార్పుల చేర్పుల గురించిన డేటా నాకింకా అందలేదు సర్."

'లాప్‌టాప్ టు కీప్ ట్రాక్' అన్నవాడి బాబులా..." అని నేను ఏదో అనేటంతలోనే అచలపతి కనుబొమలు ముడిపడ్డాయి. పై పెదవి మరింత బిగుసుకుంది. క్రింది పెదవి ఓ మూలకు కాస్త ఒరిగింది. తన యజమాని గ్రామ్య భాషను అచలపతి నిరసిస్తున్నాడని నాకర్థమయిపోయింది.

"అచలపతీ, కనుబొమ్మల ముడి విప్పేయి. ఇక్కడ 'వాడి' అనేది విశేషణం. చంద్రబాబు బుద్ధి నిశితంగా ఉందంటున్నానన్నమాట.. ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, నువ్వు త్వరపడి ఆన్‌లైన్ కరక్షన్లు చేసేయకు. తెలుగు పేర్ల గురించి నా అభిప్రాయం మారలేదు. యతి అనే పేరు మామయ్యకు అతకదు అనేదే నా కవి హృదయం'.

'బజార్లో పాలు కొనుక్కోగలిగినప్పుడు గేదెను కొనుక్కోవడం ఎందుకు?' అని తర్కించే బ్రహ్మచారులు యతి మామయ్యకు నచ్చరు. అసలు పాలు మాత్రం కొనడమెందుకు? అని ఆయన వాదన. అవునుమరి. ఆయన అందం, చురుకుదనం, జమీందారీ నేపథ్యం చూసి చాలా మంది అమ్మాయిలు ఆయన వెంట పడ్డారు. ఆయన పెళ్లి వంటి బాదర బంధనాల వంకకు పోకుండా రకకరాల, రంగు రంగుల వేషాలతో మధ్యందిన మార్తాండునిలా పెరిగి ప్రస్తుతం జీవనసాయంత్రాన్ని గతించిన వలపుల తలపులతో గడుపుతున్నాడు. అలాటివాణ్ణి యతి అనడం ఏమిటి?'

ఇవేమీ పైకి అనకపోయినా అచలపతి నా తల 'స్కాన్' చేసేసేడేమో! “పెద్దలు పెట్టిన పేరు ఊరికే పోదు సర్ ! ఆ పేరు ఏదో ఒక దానికి దారితీస్తుందేమో” అన్నాడు.

అప్పటికది ఓదార్పు మాటగా అనిపించినా చిత్ర రాక తర్వాత జరిగిన సంఘటనల వలన పెద్దల వివేకాన్ని అంతగా తప్పుపట్టవలసిన అవసరం లేకపోయింది.

చిత్ర వరుసకు నాకు చెల్లెలవుతుంది. వాళ్ల పల్లెటూళ్లో డిగ్రీ చేశాక కంప్యూటర్ కోర్సు చేస్తానంటూ చెన్నపట్నం చేరింది. వాళ్ల అమ్మానాన్నా సిటీకీ పంపడానికి ఇష్టపడలేదు కానీ మా ఇంట్లో ఉంటుంది కదాని ధైర్యం చేశారు. మూణ్ణెల్ల కోర్సే కదాని నేను ధైర్యం చేసాను. మా మాంకాళి అత్తయ్య కొడుకు జితేంద్ర కూడా అదే సమయానికి దిగబడతాడని తెలియకపోవడం నా ధైర్యానికి రెండో కారణం.

కొడుకు బారసాల చేసేటప్పుడు కూడా మాలోకం మామయ్య ఏదో మా లోకంలోనే ఉన్నాడు. బియ్యంలో జితేంద్ర అని పేరు రాస్తూ ఎక్స్ట్రాగా 'త' వత్తు ఇచ్చేస్తాడు. ఎలాగూ పేరు పడిపోయాం కదాని మావాడు జిత్తులు తెగనేర్చాడు. వాడేం చేస్తున్నాడో ఎవడికీ సరిగ్గా తెలియదు. మా ఇంటికి వచ్చినప్పుడు అడిగిచూశా– సినిమా తీద్దామని వచ్చాడట, చిరంజీవా?వెంకటేశా? తేల్చుకుందామని వచ్చాడట. ఇద్దరూ ఫ్రెండ్సేనట. ఒకళ్లని బుక్‌చేస్తే మరొకరు నొచ్చుకోవచ్చుట. మొహమాటం చెడకుండా వ్యవహారం చక్కబెట్టాలని వచ్చాడట.

నా బోటివాడే వాడి మాటలు ఓ వారం రోజుల పాటు నమ్మేడంటే పల్లెటూరి నుంచి వచ్చిన చిత్ర నమ్మకుండా ఉంటుందా? అందునా సిటీలో ఆడా,మగా ఊహు డాన్సులు చేసేస్తూ, తిరిగేస్తూ ఉంటారని సినిమాల ద్వారా తెలుసుకున్నదాయె! నాలుగైదు సార్లు వాళ్లిద్దరూ కలిసి బయటకెళ్లడం చూసేదాకా నాకీ విషయం తట్టలేదు. చిత్ర ఒంటి మీద రెండు మూడు ఫ్యాన్సీ నగలు చూసేదాకా జితేంద్ర ఆమెను వలలో వేసుకోడానికి

ప్రయత్నిస్తున్నాడని తోచలేదు.

మాంకాళి 'అత్తయ్య' ను అత్తయ్యని పిలవవలసి రావడం నా లలాటలిఖితం. కానీ చిత్ర లాటిది చూసి చూసి ఆ ఖర్మ పట్టించు కోవడం నమ్మదగ్గవిషయం కాదు. కానీ మన జితేంద్రజాలరి వేసిన వలపు వలలోని ఎర మింగేసిన వారికి ఎరిక ఉండదేమో! కానీ చిత్ర తల్లిదండ్రులు మాత్రం వల వలయానికి ఆవల ఉన్నారు కాబట్టి వారీ పెళ్లికి ఒప్పుకోకపోగా పరిస్థితి చేజార నిచ్చినందుకు (ఖర్మ కాలితే, చిత్రను కాలుజారనిచ్చినందుకు) నన్ను తప్పు బట్టవచ్చు.

అచలపతిని పిలిచా. విశదీకరించా. నా పథకం చెప్పబోయా. కానీ, "మీరు అనవసరంగా చింతిస్తున్నారని నా భావన సర్. వయసులో ఉన్న పిల్లలు సరదాగా తిరిగినంత మాత్రాన – అనివార్యం, అంటే ఇంగ్లీషులో ది ఇనెవటబుల్ –జరుగుతుందని ఊహించడం ఎల్లవేళలా సరైనది కాదని నాకు తోస్తుంది సర్ – ముఖ్యంగా జితేంద్రగారి వ్యక్తిత్వాన్ని పరిగణనలోకి తీసుకుని పరిశీలించినప్పుడు.." అన్నాడు అచలపతి.

"నువ్వు చెప్పినది బాగుంది. తెలుగులో చెబితే ఇంకా బాగుండేది".

"అంటే జితేంద్రగారి అలవాట్లు, అభిరుచి, అభినివేశము లెక్కలోకి తీసుకొన్నప్పుడు ఆయనకు మీ చేత గడ్డం కింద బెల్లం కొట్టించు కోవాలని మరీ ఉత్సాహపడుతున్నట్లు అభిప్రాయం కలగదు సర్".

"అయితే మరీ డేంజరస్... ఏదో అఘాయిత్యం చేసి పారిపోతే చిత్ర నాన్న వచ్చి నా గడ్డం పగలగొట్టవచ్చు. నో,నో వీళ్లిద్దరినీ విడగొట్టకపోతే ప్రమాదం జరగడం తథ్యం. చిత్ర అంతగా బయటకు తిరగాలనుకుంటే యతి మామయ్యను తీసుకెళ్లమంటాను".

"యతి మామయ్యగారి గతాన్ని దృష్టిలోపెట్టుకుని కూడా.."

"గతం గతః, మామయ్య ఇప్పుడు రిటైరయిన ఉమనీటర్. నాకే నచ్చటం లేదు, అమ్మాయిలకేం నచ్చుతాడు?"

"ఒన్స్ ఏ లేడీ కిల్లర్, ఆల్వేజ్ ఏ...."

"అచలపతీ, ఒక విషయం ఒప్పుకో. ఈ మధ్య కేసులన్నీ నేనే చూస్తున్నాను. మొదట శ్రేష్టమైన సలహా ఇవ్వడానికి. తర్వాత అంత శ్రేష్టమైనదీ, సరుకు లెందుకు చేరవేరలేక పోయిందో– అంటే నాట్ డెలివరింగ్ ది గూడ్స్ అన్నమాట – సమీక్షించడానికి ఆలోచిస్తూ నా మెదడులోని నరాలన్నీ పదునెక్కి నేను మేధావినయ్యాను. ఈ సారి ఆ

పేరుతో సినిమా తీసినప్పుడు నార్త్ ఇండియా నుంచి హీరోని దిగుమతి చేసుకోనక్కర్లేదు. సౌతిండియా గొడ్డుపోలేదు, భవదీయుడు అందుబాటులో ఉన్నాడు అని ఓ విజ్ఞప్తి కూడా చేద్దామనుకుంటున్నాను. “కానీ నువ్వు? నాటకంలో మూడో కృష్ణుడిలా గీతోపదేశం సీన్లో కాస్సేపు మాత్రం కనబడుతున్నావు. ఎక్కువ ఆలోచించకుండా సలహాలిచ్చేస్తున్నావు. అందువల్ల డిస్యూజ్ వల్ల నీవి కొన్ని గ్రే సెల్స్ డిఫంక్ట్ అయిపోయాయన్నమాట. ఆ కారణం చేతనే నువ్వు మామయ్య ‘ఏజ్ ఫేక్టర్‌ని’ విస్మరిస్తున్నావు. ఆ పడుచు పిల్లకు కావలసింది వయసు కాదయ్యా, ముసలి వాడు కాదు”.

ఆ ‘ఏజ్ ఫేక్టర్’ని సమస్యను అధిగమించి నట్టున్నాడు యతి మామయ్య. నెలన్నర తర్వాత నాతో మాట్లాడుతూ, “చిత్రా నేనూ పెళ్లాడబోతున్నాంరా, అనంతూ” అన్నప్పుడు నేను అదిరిపడ్డాను.

అయినదానికీ, కానిదానికీ అదిరిపడే రకాన్ని కానునేను. టూరింగు టాకీసుల్లో, ఒకే సెంటరులో అయిదు హాల్స్‌లో రిలీజయిన సినిమాలు చూసే వాళ్లందరిలాగే సినిమా రీళ్లు ఒక్కొక్కప్పుడు ముందు వెనకా తారుమారవుతుంటాయని నాకు తెలుసు. సినిమాలో ఓ కుర్రది, కుర్రాణ్ణి ప్రేమిస్తుంది. వాడు పెళ్లి చేసుకొన్నా, చేసుకోకపోయినా కడుపు మాత్రం చేసి మిలటరీ కెళ్లి ధామ్మంటాడు. ప్రవేశం – ఓ ముదుసలి! కుర్రదాన్ని పెళ్లాడి ఆమె గౌరవాన్నీ, బిడ్డనూ కాపాడి ఆమె ఒంటిమీద చేయి వేయకుండా తనను తాను కాపాడుకొని... ఇలాంటి కథలో వెనక రీలు ముందుగా చూపించడం సినిమాల విషయంలో సాధ్యం. కానీ ఇది నిజజీవితం. నాలుగో రీలు తర్వాత పదోరీలు వచ్చేయడమేమిటి? ‘కొంపదీసి నేను టైము మెషిన్లో భవిష్యత్తులోకి వచ్చేసేనా?’ అన్న ఆలోచన వచ్చి అదిరిపడ్డానన్నమాట.

“..నిజానికి నన్నో ఇంటివాణ్ణి చేస్తున్న ఘనత నీదే ననుకో – చిత్రను బయటకు తీసుకెళుతూండమని నువ్వే కదా బతిమాలేవు. ఒకటి రెండు సార్లు తీసుకెళ్లేసరికి నాకూ ఆ అమ్మాయి నచ్చింది. అడపాదడపా బహుమతులూ అవీ ఇచ్చేవాణ్ణి. బట్టలెలా వేసుకోవాలో, ఎలా మాట్లాడాలో, ఎలా నవ్వాలో అన్నీ నేర్పా– పల్లెటూరి నుండి వచ్చింది కదా. పాపం ఇవన్నీ పెద్దగా తెలియవు. ముందు మర్యాద కోసం చెప్పిన మాట విన్నా, క్రమంగా నా మీద అభిమానం పెంచుకుంది. నేనూ ఇక పెళ్లి చేసుకుని స్థిరపడదా మనుకుంటున్నాను. ప్రపోజ్ చేయగానే సరేనంది. వచ్చే నెలలోనే పెళ్లి...”

అంటూన్నాడు మావయ్య.

అంటే జాలిపడి గర్భవతిని చేసుకునే కేసు కాదన్నమాట. గర్భవతి చేసే ప్రయత్నమే నన్నమాట.

"మావయ్యా నువ్వు జుట్టుకు రంగేసి, రంగుల చొక్కావేసి, జీన్సేసి వస్తే ఫ్లాష్‌బ్యాక్ సీను అనుకొన్నాను కానీ ఇలా బొత్తిగా రీళ్లు తారుమారవుతాయనుకోలేదు. నేనిప్పుడు టైమ్ మెషీన్‌లో ముప్ఫైయేళ్ల వెనక్కి వెళ్లిపోయినట్టున్నాను. వర్తమానానికి లాక్కొచ్చేయి ప్లీజ్" అని బతిమలాడుకున్నాను.

మావయ్య చిరునవ్వాడు. క్లార్క్ గేబుల్‌లా; షారూక్‌ఖాన్లా కాదు. అంటే ఖరారుగా గతమేనన్నమాట.

గతం కాదన్నాడు మామయ్య. వర్తమానమేనట. అరవయ్యోపడిలోనే ఉన్నాడట. ఇరవైయేళ్లు దాటని చిత్రని పెళ్లి చేసుకుంటాడట. నా ముఖంలో ఆశ్చర్యం చదివేసినట్టున్నాడు. "వయస్సు తేడా గురించేనా? దానికి బందోబస్తు చేసానులేరా! షారూక్‌ఖాన్ నవ్వు ప్రాక్టీసు చేస్తున్నానులే"అన్నాడు ధైర్యం చెప్పడానికి భుజం తడుతూ.

"నవ్వు సరేలే, సంసారజీవితమో!? ఈ ప్లస్ మందులు డబ్బులు మైనస్ చేయడానికే గానీ.."

"అబ్బ, మందులు కాదురా. ఓ కుర్రాడూ, నేనూ వయసు ఎక్స్‌ఛేంజ్ చేసుకున్నాం. అంటే నా ముసలితనం అతనికీ. అతని పడుచుతనం నాకూ వచ్చేసాయన్న మాట".

"మావయ్యా, తలెందుకో తిరుగుతోంది. అచలపతి మాటలు కూడా ఈ మధ్య అర్థమవుతున్నాయి కానీ నీ స్టేట్‌మెంటు మాత్రం గజిబిజిగా ఉంది".

"ఇందులో అర్థం కానిదేముందిరా. మన పురాణాల్లోనే వుందిగా, యయాతి కథ! నిజానికి నేనిలాంటి పని చేస్తానని తెలిసే కాబోలు మా వాళ్లు యయాతి అని పేరుపెట్టారు. ఇక యతి కాదు. యయాతి మావయ్య అని పిలు. ఆగాగు. నాకు తెలుసు నువ్వు పురాణగాథలు కొట్టి పారేస్తావని ఆ కుర్రాడు తన రక్తం ఒక బాటిల్ నిండా నింపి తన యవ్వనశక్తినంతా తన చూపులు ద్వారా – ఏదో అన్నాడురా – యోగాశక్తో, ప్రాణిక్‌శక్తో అని దాంట్లోకి ఎక్కించి ఇచ్చాడు. హాస్పిటల్‌కి వెళ్లి ఆ రక్తం నేనెక్కించుకున్నాను. అప్పణ్ణుంచే కుర్రాడినయి పోయాను.

"నిజానికి చిత్ర నా వయసు గురించి పట్టించుకోనంది. కానీ నాకే ఎబ్బెట్టుగా తోచింది ఇన్నాళ్లూ. ఈ కుర్రాడు యవ్వనం దానం చేయడం వల్ల ఆ శంకా కూడా

తీరిపోయింది. పెళ్లికి నువ్వుండాలిరోయ్. నువ్వే సూత్రధారుడివి".

"ఒక్క క్షణం మావయ్యా. ఇంతకీ ఆ కుర్రాడెవరు? ఈ ప్రాసెస్‌కి అతనికి నువ్వెంత ఇచ్చావ్?"

"ఏదోలేరా! మంచివాడు. పేరెవరికీ చెప్పవద్దన్నాడు. 'ఆజన్మబ్రహ్మచారిగా ఉండడానికే



నిశ్చయించుకున్నాను. నాకెందుకీ యవ్వనం!? పాతిక వేలిస్తే మీకిచ్చేస్తాను' అన్నాడు..
''

ఓ బుడ్డి రక్తం – ఖరీదు పాతిక వేలా?

మావయ్యను ఇంత బోల్తా కొట్టించగలిగినవాడు సామాన్యుడు కాడు. వెతికి పట్టుకుని నమస్కరించాల్సిందే. ముందు చిత్రను నిలదీయాలి.

చిత్రచిత్రంగా మాట్లాడింది చిత్ర! యవ్వనం మనసుకే కానీ, శరీరానికి కాదట. కేవలం తన చేత డబ్బు ఖర్చు పెట్టించే జితేంద్ర వంటి కుర్రాడి కన్నా, తనంటే వెర్రిపడే యతి మావయ్య లాంటి వారి సన్నిధిలోనే తను సుఖపడుతుందిట. యతి మావయ్య లోకాన్ని, లోకులనూ చూసిన అనుభవజ్ఞుడట!

"ఆ లోకుల్లో ఆడ లోకులు ఎక్కువ మంది. ఆ విషయం తెలుసా?"అని అడిగాను.

"తెలుసు. అందుకే ఆడదాన్ని ఎలా మురిపించాలో, మెప్పించాలో తెలుసాయనకు. జితేంద్ర లాంటి కుర్రాళ్లు అహంభావం కొద్దీ భార్య ఇష్టాయిష్టాలు పట్టించుకోరు. పక్క చూపులు చూస్తారు. ముసలాళ్లతో ఆ బాధ ఉండదు. నా వెంట పడి నా చూపు కోసం తపించేవాడే నాకు కావాలి. వాడు ముసలయితేనేం? ముతకయితేనేం?" అంది.

ఇంతలో 'చెప్పలేదంటనకపొయ్యారూ..' అంది ఓ వాణి నా చెవిలో.

'ఎవరు స్వామీ? వీరబ్రహ్మంగారా?' అన్నాను గుసగుసగా.

'కాదు , భర్తృహరిని. కథ మొదట్లోనే హెచ్చరించా, పెడచెవిన బెట్టావు. అందుకే ఈ చెవిని ఆశ్రయించాను'.

ఈ పెళ్లిని భగ్నం చేయ్యకపోతే చిత్ర తల్లిదండ్రులు నన్ను చిత్రవధ చేయడం ఖాయం. జితేంద్రను పిలిచా – ఏదో జిత్తేసి చిత్రను చిత్తు చేయగలడేమో కనుక్కొందామని. "అబ్బే" అన్నాడు వాడు.

"ఏం? నీ రూపం తనకు నచ్చలేదా? అవునొరే. ఆ తెల్లవెంట్రుక లేమిటిరా ముసలాడిలా?" అని అడిగా.

"చిరంజీవి ఏమైనా అనుకొంటాడేమెనని ఆలోచించి, ..చించి జుట్టు నెరిసిపోయింది."

"ఆ మధ్య అడిగినప్పుడు వాళ్ళిద్దరికీ 'క్లాష్' రాకుండా వెంకటేష్‌ను తెలుగు వర్షన్‌కీ, చిరంజీవిని హిందీ వెర్షన్‌కీ బుక్ చేసానన్నావు.."

"అవునా, మరి హిందీ మార్కెట్ కంటే తెలుగు మార్కెట్ చిన్నది కదాని వెంకటేష్ నొచ్చుకుంటాడనిపించింది, తెలుగు, తమిళ వెర్షన్లు రెండూ అతనికే ఇద్దామనుకొన్నాను.

తీరా చూస్తే చిరంజీవి ఫీలవుతున్నాడు. వెంకటేష్‌కి  రెండు వెర్షన్లు ఇచ్చి తనకి ఒక వెర్షనే ఇచ్చాడేమిట్రా జితేంద్రని! ఇవన్నీ ఓపెన్‌గా చెప్పరనుకో, ఫ్రెండ్స్ కదా, మనమే గ్రహించాలి".

ఇంతలో మావయ్య గదిలోకి రావటంతో జితేంద్ర గొంతులో కాస్త వణుకు వచ్చింది. మావయ్య వెళ్లిపోగానే నా తలలో బల్బు వెలిగింది.

"ఈమధ్య నీ యవ్వనాన్ని ఎవరికైనా అమ్మేసేవేమిట్రా? గుమ్మడి స్టేజ్ రాకుండానే నాగయ్య వయిపోయావు?" అన్నాడు.

వాడు బల్బు ఆర్పేయబోయాడు. "యవ్వనం అమ్మడమేమిటి బావా? సైఫీ నవలలేమైనా చదువుతున్నావా?" అని బుకాయించబోయేడు.

"తగ్గవోయ్, యతి మావయ్య సంగతంతా చెప్పేసాడు".

వాడు ఫిలాసఫీ పరీక్షలో ఫెయిలయిన వేదాంతిలా నవ్వాడు. "ఏదో, ఆయన ముచ్చట పడ్డాడు.. పోనీలే, అసలు చిరంజీవి.."

"..యతి మావయ్యకు మతిలేక పోయినా నువ్విలా.."

"బావా, పెద్దాయన్ని అలా ముద్దుపేరు పెట్టి పిలవడం భావ్యం కాదు. ఆయన పూర్తిపేరు యయాతి".

"గాడిదగుడ్డు... నీ బండారం బయట పెట్టకపోతే.."

"లాభంలేదు, ఆయన నమ్ముడుగాక నమ్మడు. దేరీజ్ నో ఫూల్ లైక్ ఏన్ ఓల్డ్ ఫూల్..".

అచలపతిని పిలిచి నా వానప్రస్థానానికి ఏర్పాట్లు చేయమన్నాను.

"మీరు ఎవరి దగ్గరైనా వృద్ధాప్యం కొనుక్కున్నారా సర్!" అని అడిగాడతను.

"ఈ బేరసారాలు నీకూ తెలిసాయన్న మాట! చిత్ర అమ్మానాన్నా వచ్చి మోక్షం ప్రసాదించే లోపున నేను వానప్రస్థానానికి ప్రస్థానమయితే మంచిదని.."

"పెళ్లి కివ్వాల్సిన బహుమతి మీరక్కడనుంచే పంపుతారా? లేక ఇక్కడే ఏదైనా కొని.."

అచలపతి ఎత్తిపొడుపులకు దూరంగా విజయవాడలో రంగడి దగ్గరకు వెళ్లిపోయాను. నెల్లాళ్ల తర్వాత తిరిగొచ్చి వాకబు చేశా, బహుమతి ఏమిచ్చాడని.

"మన్నించాలి సర్, అది కొనే అవసరం పడలేదు".

"చిత్ర అమ్మానాన్నా నా దగ్గర్నుంచి బహుమతి తీసుకోడానికి వీల్లేదన్నారా?"

"వారు రాలేదు సర్"

"యయాతి మావయ్య పిలవద్దన్నాడా?".

"చిన్న సవరణ సర్, ఆయన పేరు ఇప్పుడు యతి మాత్రమే".

"యయాతి పేరు చిత్రకు నచ్చలేదా?"

"నేను కనుక్కోలేదు సర్, ఆవిడ కోపంగా వెళ్లిపోతున్నప్పుడు అడగడం బాగుండదని ఊరుకున్నాను".

"కోపమా? అప్పుడే అలకలు ప్రారంభమయ్యాయా?"

"అలక అనే పదం ఇక్కడ అతకదనుకొంటాను సర్".

"కొత్తగా పెళ్లయినవాళ్లు అలగకపోతే.."

"మీరు యతి, చిత్రగార్ల నుద్దేశించి వుండి ఉంటే, మీ సమాచారాన్ని అప్ టు డేట్ చేసుకొనవలసిన అగత్యం ఉంది సర్! వారి పెళ్లి జరగలేదని నివేదిస్తున్నాను"

"హారినీ, ఆ సంగతి చెప్పవేం? చిత్ర మనసు మార్చుకుందా?"

"అసలు జితేంద్ర యవ్వనం అమ్మలేదన్న సందేహం యతిగారికి కలిగింది సర్"

"సందేహం కలిగించిందెవరు?"

"ఆయన వేలికి గాయం తగిలినప్పుడు డాక్టరు వద్దకు వెళ్ళమన్నది నేనే సర్. జితేంద్ర గారి రక్తం కాస్త పట్టుకెళ్లమన్నది కూడా నేనే. రెండు రకాల గ్రూపులు వేరే వేరే అన్నది మాత్రం డాక్టరుగారు. దాంతో యతిగారికి అనుమానం వచ్చి క్రితంసారి రక్తం ఎక్కించిన హాస్పిటల్లో వాకబు చేసారు. అది వేరే గ్రూపుదనీ, ఇచ్చినాయన ఆయన కంటె ముసలాయననీ వార్డ్‌బోయ్ చెప్పడంతో చప్పబడిపోయి పంచె కట్టుకోవడం ఆరంభించాడు. ముసలితనం ముంచుకొచ్చేసిన తనని పెళ్లాడి ప్రయోజనం లేదని చిత్రకు చెప్పేసి హొరైజన్‌కు రైలెక్కారు సర్!"

"హమ్మయ్య, గండం గడిచింది. మావయ్య వేలు కోసుకోవడంతో కథ సుఖాంతం అయిందన్నమాట. అసలు వేలెలా కోసుకుంది?"

"అది నా పొరబాటే సర్! ఆపిల్ కోసుకోవడానికి చాకు అడిగితే బాగా పదునుగా వున్న చాకు ఇచ్చాను".

"పోన్లే నీ పొరపాటు మన్నిస్తున్నాను. దాంతో బాటు నీకో రెండు వందలు బహుమతి కూడా ఇస్తున్నాను. పెళ్లికి కొనాల్సిన బహుమతి ఖర్చు తప్పిపోయిందిగా".

"థాంక్స్ సర్! ఆ రెండొందలతో పాటు ఆ వార్డ్‌బోయ్ కిచ్చిన మూడొందలు

కూడా ఇప్పిస్తే ఇంకా థాంక్స్".

అంటే, ముసలాడి రక్తం ఎక్కించినట్టు చెప్పడానికి వార్డ్‌బోయ్‌కి లంచం ఇచ్చాడా అచలపతి!? అంటే కావాలని పదునైన చాకు ఇచ్చి...

గండం గట్టెక్కించడానికి అచలపతి మళ్లీ చేయందించాడా???

